


# తెలంగాణ గంగావతరణం

నేడే కాళేశ్వరం వార్షికోత్సవం



మొత్తం ప్రాజెక్టు విస్తీర్ణం **70,000 ఎకరాలు**

ప్రాజెక్టులో దశలు **7 లింకులు, 28 ప్యాకేజీలు**

నిర్మాణ సమయం **36 నెలలు**



వాడిన మట్టి 53 కోట్ల క్యూబిక్ మీటర్లు (1000 కోట్ల తట్టల మట్టి)

వాడిన ఇసుక 7 లక్షల క్యూబిక్ మీటర్లు

వాడిన ఉక్కు 7 లక్షల టన్నులు (100 ఈఫిల్ టవర్లతో సమానం)

పనిచేసిన కూలీలు, కార్మికులు, ఇంజినీర్లు 60 వేల మంది



₹80,000 కోట్లు వ్యయం (సుమారుగా)



కాళేశ్వరం చివరి ఆయకట్టు అయిన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం బొల్లంపల్లి శివారులో కాళేశ్వరం జలాలతో వరిసాగు

# కాళేశ్వర జల ఫలమిది!

- దశాబ్దాల సాగునీటి తిప్పలు మాయం
- సమూలంగా మారిన సాగు ముఖచిత్రం
- 12 జిల్లాల్లో సరికొత్త అధ్యాయం లిఖితం

## 6.37 లక్షల ఎకరాల్లో పెరిగిన వరి విస్తీర్ణం

- 36,675 ఎకరాల మేర జలవనరుల పెంపు
- 33 శాతానికి పైగా తగ్గిన పడావు భూములు
- సాగునీటి డిమాండ్ 62 టీఎంసీలు పెరుగుదల
- స్పష్టంచేసిన ఇక్రిశాట్ సైంటిస్టుల అధ్యయనం
- అమెరికా, టర్కీ, గ్రీస్ శాస్త్రవేత్తల ఆమోదం



ప్రణయ్ పంజాల



డాక్టర్ మురళీకృష్ణ గుమ్మ



శశి మెసపం

దశాబ్దాలుగా పడావు పడి నెర్రెలు బారిన తెలంగాణ భూములను సస్యశ్యామలం చేసింది కాళేశ్వరం! సాగునీటి గోస తీర్చి రైతుల కన్నీళ్లు తుడిచింది కాళేశ్వరం! తెలంగాణకు జీవధారగా మారి రాష్ట్ర వ్యవసాయ రంగ ముఖచిత్రాన్ని మార్చి.. దేశానికే తలమానికంగా నిలిపింది కాళేశ్వరం! కాళేశ్వరం ప్రాజెక్టు సాక్షాత్కరించిన తర్వాత తెలంగాణలో వ్యవసాయం వర్ధిల్లిందని సాక్షాత్తూ ఇక్రిశాట్ సైంటిస్టులు చేసిన అధ్యయనం సైతం తేల్చిచెప్పింది. ఈ ప్రాజెక్టుతో ప్రయోజనం లేదని వాదించేవారికి 'జియో స్పేషియల్ అసెస్మెంట్ ఆఫ్ క్రాపింగ్ ప్యాటర్న్ షిఫ్ట్స్ అండ్ దెయిర్ ఇంపాక్ట్ ఆన్ వాటర్ డిమాండ్ ఇన్ కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కమాండ్ ఏరియా, తెలంగాణ' పేరుతో పబ్లిష్ అయిన రీసెర్చ్ పేపర్ చెంపపెట్టులాంటి సమాధానమిచ్చింది. ఇక్రిసాట్ సైంటిస్టులు ప్రణయ్ పంజాల, డాక్టర్ మురళీకృష్ణ గుమ్మ, వరంగల్ నిట్ ప్రొఫెసర్ శశి మెసపం కలిసి కాళేశ్వరం పరిధిలోని 12 జిల్లాలు, 118 మండలాల్లో రీసెర్చ్ చేసి ఈ నివేదికను రూపొందించారు. దీన్ని అమెరికా, టర్కీ గ్రీస్‌కు చెందిన పలువురు శాస్త్రవేత్తలు పరిశీలించి, ఆమోదించారు. ప్రపంచంలోనే అతి పెద్ద, ప్రభావవంతమైన రీసెర్చ్ పబ్లిషర్లలో ఒకటైన 'ఫ్రంటియర్స్ ఇన్ రిమోట్ సెన్సింగ్'లో ఈ నివేదిక ప్రచురితమైంది. **- హైదరాబాద్, నమస్తే తెలంగాణ**

### ఏం అధ్యయనం చేశారంటే!

ఈ అధ్యయనం 12 జిల్లాల పరిధిలో కొనసాగింది. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టక ముందు 2018-19లో, కట్టిన తర్వాత 2022-23లో సాగు విస్తీర్ణం, పంటల రకాలు, క్రాప్ వాటర్ డిమాండ్, మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై ఇక్రిసాట్ సైంటిస్టులు అధ్యయనం చేశారు.

### ఎక్కడెక్కడ చేశారంటే!

జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, మల్కాజిగిరి, నల్లగొండ, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిధిలో అధ్యయనం కొనసాగించారు. 2023 మార్చిలో 594 చోట్ల నుంచి నమూనాలను సేకరించారు. గూగుల్ ఎర్త్ ఇమేజినరీ ఐ క్రాప్స్ మొబైల్ అప్లికేషన్ ద్వారా మ్యాపులు సేకరించి విశ్లేషించారు. సమాచారం నిజమో? కాదో? నిర్ధారించుకునేందుకు 402 చోట్ల నుంచి క్షేత్రస్థాయిలో సేకరించిన డాటాతో సరిపోల్చారు.

### ఎలా చేశారంటే!

రీసోర్స్‌శాట్, కార్టోశాట్, సెంటినెట్-2, ల్యాండ్‌శాట్, మోడీస్ తదితర శాటిలైట్లు ఇచ్చిన సమాచారం ఆధారంగా పంటల సాగు, విస్తీర్ణం, భూమి వినియోగం వంటి వివరాల మ్యాప్‌లను సేకరించారు. వీటిని రాండమ్ ఫారెస్ట్ (ఆర్‌ఎఫ్), సపోర్ట్ వెక్టార్ మెషీన్స్ (ఎస్‌వీఎం), ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్ (ఎన్ఎన్) వంటి మెషీన్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ ద్వారా విశ్లేషించారు. వీటికి అదనంగా స్పెక్ట్రల్ మిక్సర్ మోడల్స్, యాక్సెస్ ల్యాండ్ యూజ్ అండ్ ల్యాండ్ కవర్ (ఎల్‌యూఎల్‌సీ) వంటి అధ్యయనాలను పరిగణనలోకి తీసుకున్నారు.

### ఏం తేల్చారంటే!

తెలంగాణలోని వ్యవసాయ రంగంపై కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అద్భుత ప్రభావాన్ని చూపిందని తేల్చారు. ప్రాజెక్టు కట్టి గోదావరి జలాలను మళ్లించడం ద్వారా రాష్ట్ర సాగునీటి, వ్యవసాయ రంగాల రూపురేఖలే మారిపోయాయని స్పష్టంచేశారు.



## కాళేశ్వర ఫలితాలకు ప్రతిబింబం

'కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితంగా దాని పరిధిలోని మండలాల్లో భూ వినియోగం, వ్యవసాయ విధానాల్లో వచ్చిన గణనీయ మార్పును ఈ అధ్యయన ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా నాలుగేండ్లలోనే వరిసాగు విస్తీర్ణం 82.1 శాతం పెరగ్గా, వర్షాధారంగా పండించే మొక్కజొన్న, చిరుధాన్యాల నుంచి రైతులు వరి వైపు మళ్లారు. ఇది కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పెరిగిన సాగునీటి లభ్యత, సరఫరా వ్యవస్థల మెరుగుదలను నిర్ధారిస్తున్నది. పడావు భూముల విస్తీర్ణం నాలుగేండ్లలో 30.3 శాతం తగ్గింది. ఇది నీటి లభ్యత పెరుగుదల, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నది. జిల్లాలవారీగా పరిశీలించినప్పుడు మెదక్ అత్యధికంగా లబ్ధిపొందగా, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి' అని నివేదిక స్పష్టం చేసింది.

### 82.1 శాతం పెరిగిన వరిసాగు

2018-19, 2022-23 మధ్య పోల్చినప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని 118 మండలాల్లో వ్యవసాయ విధానం సమూలంగా మారినట్టు నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆయా మండలాల్లో వరి సాగు 82.1 శాతం పెరిగినట్టు తెలిపింది. 2018-19లో 3,13,929 హెక్టార్లలో వరి సాగుచేయగా, 2022-23 నాటికి 5,71,632 హెక్టార్లకు పెరిగినట్టు పేర్కొన్నది. మెదక్ జిల్లాలో వరిసాగు ఊహించని స్థాయిలో పెరిగిందని నివేదిక వెల్లడించింది. నాలుగేండ్లలో వరి సాగు విస్తీర్ణం 219 శాతం పెరిగినట్టు పేర్కొన్నది. రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో 75 శాతం నుంచి 134 శాతం వరకు వరిసాగు విస్తీర్ణం పెరిగినట్టు తెలిపింది. నగరీకరణ కారణంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వరిసాగు తగ్గినట్టు వెల్లడించింది. కాళేశ్వరం ప్రాజెక్టుతో నీటి లభ్యత పెరిగిందనడానికి ఈ గణాంకాలే నిదర్శనమని వ్యవసాయ రంగ నిపుణులు స్పష్టంచేస్తున్నారు. 6.37 లక్షల ఎకరాల్లో వరిసాగు పెరగడాన్ని బట్టి కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితంగా సాగునీటి లభ్యత పెరిగినట్టేనని తేల్చిచెప్తున్నారు.

### పెరిగిన జలవనరులు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం తర్వాత రిజర్వాయర్లు, చెరువులు, కాలువలు వంటి జలవనరుల విస్తీర్ణం కూడా పెరిగినట్టు అధ్యయన నివేదిక తెలిపింది. 2018-19లో జలవనరుల విస్తీర్ణం 81,533 హెక్టార్లు ఉండగా, 96,375 హెక్టార్లకు పెరిగినట్టు తెలిపింది. అంటే.. 14,842 హెక్టార్ల మేర (36,675 ఎకరాలు) జలవనరుల విస్తీర్ణం పెరిగినట్టు స్పష్టం చేసింది. అంటే నాలుగేండ్లలో 18.2 శాతం పెరిగాయి. ప్రాజెక్టులో భాగంగా కట్టిన రిజర్వాయర్లు, కాలువలు, అనుబంధంగా పునరుద్ధరించిన చెరువుల ఫలితంగానే జలవనరుల విస్తీర్ణం పెరిగినట్టు నిపుణులు చెప్తున్నారు.

### భారీగా పెరిగిన నీటి డిమాండ్

కాళేశ్వరం ప్రాజెక్టు కింద 'క్రాప్‌వాటర్ రిక్వైర్‌మెంట్' (సీడబ్ల్యూఆర్) నాలుగేండ్లలో గణనీయంగా పెరిగినట్టు అధ్యయనం తెలిపింది. ప్రాజెక్టు పరిధిలో 234 శాతం సీడబ్ల్యూఆర్ పెరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అధ్యయనం చేసిన జిల్లాల్లో 2018-19లో 113.75 టీఎంసీల రిక్వైర్‌మెంట్ ఉండగా, 2022-23 నాటికి 175.62 టీఎంసీలకు పెరిగినట్టు వెల్లడించింది. మెదక్ జిల్లాలో గతంలో 6.51 టీఎంసీల వాటర్ రిక్వైర్‌మెంట్ ఉండగా నాలుగేండ్లలోనే ఏకంగా 21.75 టీఎంసీలకు పెరిగినట్టు తేల్చింది.

## జిల్లాల వారీగా పెరిగిన వరిసాగు విస్తీర్ణం

| జిల్లా | సాగువిస్తీర్ణం (హెక్టార్లలో) | | మార్పు |
|---|---|---|---|
| | 2018-19 | 2022-23 | |
| జగిత్యాల | 9,625 | 13,553 | 40.8% |
| కామారెడ్డి | 41,709 | 73,198 | 75.5% |
| కరీంనగర్ | 25,270 | 47,610 | 88.4% |
| మెదక్ | 22,555 | 72,101 | 219.7% |
| నల్లగొండ | 6,958 | 14,706 | 111.3% |
| నిర్మల్ | 36,161 | 42,231 | 16.8% |
| నిజామాబాద్ | 63,443 | 99,323 | 56.6% |
| రాజన్నసిరిసిల్ల | 19,300 | 45,276 | 134.6% |
| సంగారెడ్డి | 16,564 | 29,216 | 76.4% |
| సిద్దిపేట | 43,893 | 91,799 | 109.1% |
| భువనగిరి | 47,370 | 82,846 | 74.9% |
| మల్కాజిగిరి | 3,822 | 2,621 | -31.4% |

### కాళేశ్వరంపై నివేదిక ఫలితాలు

1) సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది.
2) వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ధాన్యం ఉత్పత్తి భారీగా పెరిగింది.
3) వర్షాభావ పరిస్థితుల్లోనూ సాగునీరు సరఫరా చేయగలిగే సామర్థ్యం వచ్చింది.
4) నిరంతర నీటి సరఫరా ఫలితంగా కరువు పరిస్థితులు తొలగిపోయాయి.




## జిల్లాల వారీగా సీడబ్ల్యూఆర్ పెరిగిందిలా..

| జిల్లా | క్రాప్‌వాటర్ రిక్వైర్‌మెంట్ (క్యూబిక్ మీటర్లలో) | | మార్పు |
|---|---|---|---|
| | 2018-19 | 2022-23 | |
| జగిత్యాల | 126,935,522 | 137,217,299 | 8.1% |
| కామారెడ్డి | 418,702,588 | 646,832,239 | 54.5% |
| కరీంనగర్ | 25,396,565 | 41,756,020 | 64.4% |
| మెదక్ | 184,235,500 | 615,788,797 | 234.2% |
| నల్లగొండ | 44,709,161 | 115,014,455 | 157.3% |
| నిజామాబాద్ | 732,343,715 | 908,125,046 | 24.0% |
| రాజన్న సిరిసిల్ల | 172,981,259 | 379,418,691 | 119.3% |
| సంగారెడ్డి | 207,285,849 | 227,538,384 | 9.8% |
| సిద్దిపేట | 355,496,277 | 782,524,171 | 120.1% |
| యాదాద్రి భువనగిరి | 365,033,429 | 651,140,939 | 78.4% |
| మేడ్చల్ మల్కాజిగిరి | 32,357,119 | 22,627,636 | -30.1% |
| నిర్మల్ | 555,519,927 | 445,046,074 | -19.9% |

### ఏమిటీ సీడబ్ల్యూఆర్?

సీడబ్ల్యూఆర్‌ను సాంకేతిక పరిభాషలో క్రాప్ వాటర్ రిక్వైర్‌మెంట్‌గా పిలుస్తారు. సాధారణంగా ఒక ప్రాంతంలో నీటి లభ్యత ఎంత ఉందన్న అంశాన్ని ఆధారంగా చేసుకొని పంటలు వేస్తారు. రైతులు వేసే పంటల ఆధారంగా నీరు ఎంత అవసరమవుతుందో శాస్త్రవేత్తలు లెక్కగడుతుంటారు. దీన్నే సీడబ్ల్యూఆర్‌గా పిలుస్తారు. ఏదైనా ప్రాంతంలో సీడబ్ల్యూఆర్ పెరిగినట్లయితే.. ఆ ప్రాంతంలో నీటి లభ్యత, సాగు విస్తీర్ణం పెరిగినట్టే లెక్క.

## 5.64 లక్షల ఎకరాల పడావు భూమి సాగులోకి..

కాళేశ్వరం పరిధిలో పడావు భూముల విస్తీర్ణం గణనీయంగా తగ్గినట్టు నివేదిక స్పష్టం చేసింది. ఇది ప్రాజెక్టు సాధించిన ముఖ్యమైన విజయాల్లో ఒకటిగా అభివర్ణించింది. 2018-19లో 7,54,954 హెక్టార్ల మేర పడావు భూములు ఉండగా, 2022-23 నాటికి 5,26,559 హెక్టార్లకు తగ్గినట్టు వివరించింది. అంటే.. 2,28,395 హెక్టార్ల మేర పడావు భూములు సాగులోకి వచ్చాయని స్పష్టం చేసింది. నాలుగేండ్లలోనే నిరుపయోగంగా ఉంచిన భూమి 30.3 శాతం తగ్గినట్టు వెల్లడించింది. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి సాగునీరు అందించడంతోపాటు రైతుబంధు, రైతుభరోసా, నాణ్యమైన ఉచిత విద్యుత్తు, విద్యుత్తు రంగ సంస్కరణలు వంటివి రైతుల్లో ధైర్యాన్ని పెంచాయని నిపుణులు స్పష్టంచేస్తున్నారు. ఒకప్పుడు వ్యవసాయాన్ని వదిలి వలసలు వెళ్లిన రైతులు కూడా తిరిగి వచ్చి సాగు మొదలుపెట్టారని, ఫలితంగా పడావు భూములు తగ్గాయని తేల్చిచెప్తున్నారు.

# ₹ 80 వేల కోట్ల ఖర్చు

# 24 లక్షల కోట్ల సంపద

**కాళేశ్వరం సృష్టించిన ఆస్తి విలువ ఇది**

- కాళేశ్వరం నిర్మాణం ఖర్చు సుమారు రూ. 80 వేల కోట్లు
- నిర్మాణం ఖర్చుకన్నా 30 రెట్ల సంపద సృష్టించిన ప్రాజెక్టు
- కాళేశ్వరంతో పెరిగిన భూముల విలువ రూ. 22.5 లక్షల కోట్లు
- ఉత్పత్తి అయిన ధాన్యం విలువ రూ. 1.62 లక్షల కోట్లు
- మత్స్య సంపద విలువ రూ. 13 వేల కోట్లు

## కాళేశ్వరం భారం ఎప్పుడో తీరిపోయింది!

హైదరాబాద్, 19 (నమస్తే తెలంగాణ): 'మొరటోనికేం తెలుసు..' సామెత చందంగా కాళేశ్వరం ప్రాజెక్టు విలువ కాంగ్రెస్ సర్కారుకు తెలియడం లేదు. తెలంగాణ జలధార కాళేశ్వరం కుప్పకూలిందంటూ ప్రచారం చేస్తున్నారే తప్ప.. ఈ ప్రాజెక్టు తెలంగాణ ఆర్థిక పురోగతికి ఏ విధంగా దోహద పడిందో అర్థం చేసుకోలేకపోతున్నారు. ఈ ప్రాజెక్టు విలువ తెలియజేసేందుకు మాజీ సీఎం కేసీఆర్ ఒక సందర్భంలో 'ప్రభుత్వం కాళేశ్వరం కోసం చేసిన అప్పు ఎప్పుడో తీరియిపోయింది' అని వ్యాఖ్యానించారు. ఇది ముమ్మాటికీ నిజమేనన్న అభిప్రాయాన్ని ఆర్థిక, నీటిపారుదల, వ్యవసాయరంగ నిపుణులు కుండబద్దలు కొట్టి చెప్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. ధాన్యం ఉత్పత్తి భారీగా పెరిగింది. దీంతోపాటు భూముల విలువ ఏ స్థాయిలో పెరిగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ విధంగా కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రంలో ఏకంగా రూ. 24.25 లక్షల కోట్ల విలువైన సంపదను సృష్టించిందనే అంచనాలున్నాయి. ఇందులో భూముల విలువే రూ. 22.5 లక్షల కోట్లు పెరిగినట్టు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు ధాన్యం ఉత్పత్తి విలువ రూ. 1.62 లక్షల కోట్లు పెరగ్గా, కాళేశ్వరం నీళ్లతో పెరిగిన మత్స్య సంపద విలువ రూ. 13,195 కోట్లు. ఈ విధంగా రాష్ట్రంలో ఏ రంగమైనా సరే కాళేశ్వరానికి ముందు, కాళేశ్వరం తర్వాత అనేలా అభివృద్ధి చెందింది.

> 2014-18 వరకు రూ. 14,100 కోట్ల విలువైన చేపలు ఉత్పత్తి కాగా 2019-2023 వరకు రూ. 27,295 కోట్ల విలువైన సంపద ఉత్పత్తి అయింది. అంటే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందుతో పోల్చితే నిర్మాణం తర్వాత రూ. 13,195 కోట్ల విలువైన సంపద పెరిగింది.

ఇక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందు రాష్ట్రంలో వ్యవసాయరంగ దుస్థితి వర్ణనాతీతం. తిండి గింజలకు కూడా కష్టంగా ఉండేది. అలాంటిది కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత తెలంగాణ వ్యవసాయరంగం దశ, దిశ పూర్తిగా మారిపోయింది. ఆకలి నుంచి దేశానికి అన్నంపెట్టే స్థాయికి చేరింది. ఇందుకు వరి సాగు, ధాన్యం ఉత్పత్తి వివరాలే నిదర్శనం. 2014 నుంచి 2018 వరకు ఐదేండ్లలో రాష్ట్రంలో 202 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 407 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే ఉత్పత్తి అయింది. దీని విలువ రూ. 63,899 కోట్లు. ఇక 2019 జూన్ 21న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభమైంది. ఇక ధాన్యం ఉత్పత్తి అంచనాలకు మించి పెరిగింది. 2019 నుంచి 2023 వరకు 523 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా 1127 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయింది. దీని విలువ ఏకంగా రూ. 2.26 లక్షల కోట్లకు పెరిగింది. అంటే 2014-18 వరకు నాలుగేండ్లలో రూ. 63,899 కోట్ల ధాన్యం ఉత్పత్తి కాగా, కాళేశ్వరం అందుబాటులోకి వచ్చిన తర్వాత 2019-23 వరకు నాలుగేండ్లలో రూ. 2,26,056 కోట్ల విలువైన ధాన్యం ఉత్పత్తి అయింది. ఈ లెక్కన తెలంగాణ ప్రాజెక్టు నిర్మాణానికి ముందుతో పోల్చితే ప్రాజెక్టు నిర్మాణం తర్వాత రూ. 1,62,157 కోట్ల విలువైన ధాన్యం ఉత్పత్తి కావడం గమనార్హం. ఇది కాళేశ్వరం సృష్టించిన సంపదే కదా.

> రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో ఎకరం భూమి విలువ సగటున రూ. 5 లక్షలు పలికేది. ప్రస్తుతం ఇది రూ. 20 లక్షలకు పైమాటే. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో సాగునీటి కొరత తీరింది. ఈ నేపథ్యంలో భూముల ధరలు భారీగా పెరిగాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 150 లక్షల ఎకరాల సాగు భూమి ఉన్నట్టు ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయి. ఈ లెక్కన నాడు 150 లక్షల ఎకరాల విలువ రూ. 7.5 లక్షల కోట్లు. ఇక ఇప్పుడు ఇది రూ. 30 లక్షల కోట్లకు పెరిగింది. అంటే అనతి కాలంలోనే భూముల విలువ రూ. 22.5 లక్షల కోట్లు పెరగడం గమనార్హం.

ఒకప్పుడు మంచినీటి చేపల ఉత్పత్తికి ఆంధ్రప్రదేశ్ కేరాఫ్‌గా ఉండేది. కానీ ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం మత్స్య సంపద ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో రాష్ట్రంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులన్నీ జలసిరిని సంతరించుకున్నాయి. దీనికి తోడు బీఆర్ఎస్ ప్రభుత్వ ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంలో భాగంగా నీటి వనరుల్లో చేపపిల్లల్ని విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలో మత్స్య సంపద గణనీయంగా పెరిగింది. 2014-18 వరకు రూ. 14,100 కోట్ల విలువైన చేపలు ఉత్పత్తి కాగా 2019-2023 వరకు రూ. 27,295 కోట్ల విలువైన సంపద ఉత్పత్తి అయింది. అంటే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందుతో పోల్చితే నిర్మాణం తర్వాత రూ. 13,195 కోట్ల విలువైన సంపద పెరిగింది. ఇది కాళేశ్వరం ప్రాజెక్టు పెంచిన సంపదే కదా.

> 2014-18 వరకు నాలుగేండ్లలో రూ. 63,899 కోట్ల ధాన్యం ఉత్పత్తి కాగా, కాళేశ్వరం అందుబాటులోకి వచ్చిన తర్వాత 2019-23 వరకు నాలుగేండ్లలో రూ. 2,26,056 కోట్ల విలువైన ధాన్యం ఉత్పత్తి అయింది. ఈ లెక్కన తెలంగాణ ప్రాజెక్టు నిర్మాణానికి ముందుతో పోల్చితే ప్రాజెక్టు నిర్మాణం తర్వాత రూ. 1,62,157 కోట్ల విలువైన ధాన్యం ఉత్పత్తి కావడం గమనార్హం.

